RNI:TS-28-0030298

తెలంగాణ డైలీ న్యూస్

ప్రజల గుండె చప్పుడు

తెలుగు దినపత్రిక

telanganadailynews.in

epaper.tgdailynews.com

సంపుటి : 01 సంచిక : 264 మంగళవారం, అక్టోబర్ 13, 2026 , పేజీలు - 06 వెల : 3/-

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రా వ్యాప్తంగా వెలువడుతున్న తెలంగాణ డైలి న్యూస్ జాతీయ దినపత్రికలో, బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

9553111142

రాహుల్‌గాంధీ చేపట్టిన జ్ఞానేశ్‌కుమార్ గోబ్యాక్ ఉద్యమమే

దేశాన్ని కాపాడబోతుంది

- వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమనే అంచనాతో వ్యతిరేకుల ఓట్లను బీజేపీ తొలగించే కుట్రలు చేస్తోందని రేవంత్ విమర్శించారు.
- సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



హైదరాబాద్ :

అధికారాన్ని పదిలం చేసుకొనేందుకు ఈడీ, ఐటీ అనేక అస్త్రాలు ప్రయోగించిన బీజేపీ, ఇప్పుడు ఎస్?ఐఆర్ అనే ఆయుధాన్ని ప్రయోగించిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జ్ఞానేశ్‌కుమార్ గోబ్యాక్ ఉద్యమమే దేశాన్ని కాపాడబోతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమనే అంచనాతో వ్యతిరేకుల ఓట్లను బీజేపీ తొలగించే కుట్రలు చేస్తోందని విమర్శించారు. సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో తలపెట్టిన ధర్నా కోసం దిల్లీ చేరుకున్న రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్ ప్రక్రియపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఓటు హక్కు కల్పించేందుకు ఎస్ఐఆర్ తీసుకువస్తే, ఇప్పుడు ఓట్లను దూరం చేసేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నారని ఆరోపించారు.ఆనాడు సైమన్ గో బ్యాక్ ఉద్యమం దేశవ్యాప్తంగా ఉద్ధృతంగా సాగిందన్న రేవంత్ రెడ్డి అంబేడ్కర్ ప్రపంచమంతా తిరిగి ఎన్నో రాజ్యాంగాలను అధ్యయనం చేశారని గుర్తు చేశారు. ఎంతో అధ్యయనం చేసి ఓటుహక్కును మన రాజ్యాం గంలో చేర్చారని, పాలకుడు రాచరికం, వంశ పారంపర్యంగా కాకుండా ప్రజలు ఎన్నుకునే పద్ధతి తీసుకువచ్చారని కొనియాడారు. 1950లో తొలిసారి ఎస్ఐఆర్ పద్ధతిని అమ లు చేశారని పేర్కొన్నారు.బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగించాలని జ్ఞానేశ్‌కుమార్‌ను టాస్క్ ఇచ్చారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రధానంగా బీజేపీని వ్యతిరేకించేదని, యువత, నిరుద్యోగులు, పేదలు, ఇప్పుడు యువత, నిరుద్యోగులు, పేదల ఓట్లు తొలగించాలని జ్ఞానేశ్‌కుమార్ చూస్తున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌లో తప్పులు జరగుతున్నాయని మిగతా ఇద్దరు ఈసీలు వ్యతిరేకించారని, జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు బయటపడిందని విమర్శించారు. అలాంటి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించేందుకు ప్రధాని మోదీకి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు.

సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు

తీసుకుంటుంది



ఢిల్లీ, అక్టోబరు 12 : సర్(ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు కేంద్ర ఎన్నికల సంఘంపై విమర్శలు చేశారు. రాహు ల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపుతో ఢిల్లీలో నిరసనకు దిగారు. సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించే ప్రయత్నం చేస్తామని కాంగ్రెస్ నేతలు తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సర్' ఉపయో గించుకొని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిందని.. అర్హులైన ఓటర్లను తొలగిం చిందని ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోందని ఫైర్ అయ్యారు. ఇండి యా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతన్న ధర్నా లో తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బా బు మా ట్లాడారు. సర్‌ను రద్దు చేయాలని ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా పిలు పునిచ్చారని వ్యాఖ్యానిం చారు. సీఈసీ ఏకప క్షంగా నిర్ణయాలు తీసుకుంటుం దని ఆగ్రహిం చారు. ఎన్నికల కార్యాలయం పక్ష పాతం చూపిస్తోందని మండిపడ్డారు. తెలియజేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

ఈ కార్ రేసింగ్ కేసులో

నా పేరు తొలగించండి

విచారణను కోర్టు ఈ నెల 30కి వాయిదా వేసింది.



హైదరాబాద్: ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఫార్ములా-ఈ రేస్ నిర్వహణలో నిధుల మళ్లిం పు, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ చార్జిషీట్‌లో తనను ఏ-1 నిందితుడిగా పేర్కొనడాన్ని కేటీఆర్ సవాల్ చేశారు.ఈ కేసుకు తనకు ఎలాంటి సంబంధం లేదని తన పేరును ఈ జాబితాలో చేర్చారంటూ కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిందితుల జాబితా నుంచి తన పేరును పూర్తిగా తొలగించాలని కోర్టును కోరారు. కేటీఆర్ తరపున దాఖలైన ఈ డిశ్చార్జ్ పిటిషన్‌ను పరిశీలించిన నాంపల్లి ఏసీబీ కోర్టు, దీనిపై సమగ్ర కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీ అధికారులను ఆదేశించింది. అలాగే ఈ పిటిషన్‌కు సంబంధించి తదుపరి విచారణను ఈ నెల 30కి కోర్టు వాయిదా వేసింది.

బొల్లారం చిన్నారి హత్య కేసును ఛేదించిన పోలీసులు.

హైదరాబాద్, అక్టోబర్ 12:

భాగ్యనగరం బొల్లారం పరిధిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఐదేళ్ల చిన్నారి కిడ్నాప్, హత్య కేసును మల్కాజ్‌గిరి పోలీసులు ఛేదించారు. గేటెడ్ కమ్యూనిటీలో పనిచేసే ఓ సెక్యూరిటీ గార్డే ఈ హత్య చేసినట్లు పోలీసులు గుర్తిం చారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను మల్కాజ్‌గిరి సీపీ సుమతి మీడియా సమావేశంలో వెల్లడించారు. 'బొల్లారం పరిధిలోని సీడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో రీసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న మిల్టన్ ఫెర్నాండెజ్ మోసెస్ ఐదేళ్ల కుమార్తె ఆరేలియా.. అక్టోబర్ 10న సాయంత్రం వేళ కిడ్నాప్‌కు గురైంది. అదే రోజు రాత్రి 7:45 గంటల సమయంలో రూ.20 లక్షలు డిమాండ్ చేస్తూ కిడ్నాపర్.. చిన్నారి తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. ఈ మేరకు చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు ఆధారంగా.. మల్కాజ్‌గిరి, ఎస్ఓటీ, క్రైమ్స్, స్పెషల్ బ్రాంచ్‌లతో కూడిన పది ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాం. అయినా ఫలితం లేకపోయింది. సీసీటీవీ ఫుటేజీ, మొబైల్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేశాం. 4 గంటల్లో 130 సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాం. ఎక్కడా చిన్నారి ఆచూకీ కనిపించకపోవడంతో.. గేటెడ్ కమ్యూనిటీ అంతా గాలించగా సెల్లార్‌లోని నీటితొట్టెలోచిన్నారిమృతదేహంకనిపించింది. వచ్చి సెక్యూరిటీ గార్డులను విచారణ చేయగా.. అసలు నిజం బయటపడింది.

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన..

చార్జీల తగ్గింపుకు కసరత్తు


- ఆర్టీసీ-మెట్రో పాస్ చార్జీలపై సమీక్ష
- త్వరలో కొత్త ధరలు ప్రకటిస్తామన్న మంత్రి పొన్నం
- ధరలు భారంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు



హైదరాబాద్: హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ చార్జీలపై తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్‌కు రూ. 400 (మెట్రోకు రూ. 300, ఆర్టీసీకి రూ. 100), నెలవారీ పాస్‌కు రూ. 8,500 (మెట్రోకు రూ. 7,000, ఆర్టీసీకి రూ. 1,500) చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ ధరల నిర్ణయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన సూచన మేరకు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని చార్జీలను పునఃపరిశీలించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనని, ప్రజలపై అదనపు భారం మోపడం తమ లక్ష్యం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రయాణికుల అవ సరాలు, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే ఉన్న తాధికారులతో సమావేశమై అందరికీ అందుబాటులో ఉండేలా ధరలపై సరైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా ప్రయాణికులకు మేలు చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500గా నిర్ణయించామని మంత్రి తెలిపారు. ఛార్జీలపై సమీక్ష జరిపేందుకు సర్కార్ నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్ ధర రూ.400 కాగా.. అయితే సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఛార్జీలపై పునఃసమీక్ష చేయనున్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల అభిప్రా యాలు, వాస్తవ పరిస్థితుల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ లక్ష్యం కాదని స్పష్టం చేశారు. ఆర్టీసీ-మెట్రో సేవలను మరింత విస్తృతంగా వినియోగిం చుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే కామన్ పాస్ ధరలపై తుది నిర్ణయం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

తిరుపతిలో రూ.3,222 కోట్ల

పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం



అమరావతి, అక్టోబర్ 12:

తిరుపతి అర్బన్ డెవలెప్మెంట్ అథారిటీ పరిధిలో రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. (సోమవారం) అమరావతి సచి వాలయం నుంచి వర్చువల్‌గా పనులకు శం కుస్థాపన చేశారు. భక్తులకు సమాచారం అందించేలా వెంకటాద్రి యాప్‌ను ముఖ్యమంత్రి ఆవి ష్కరించారు. శ్రీవారి భక్తులకు సౌకర్యాలు కల్పించేలా రూ.2750 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ రెండేళ్లో పూర్తి చేయాలని.. ప్రారంభోత్సవాన్ని నిర్ణయించుకుని పని మొదలు పెట్టాలని ఈ సందర్భంగా అధికారుల ను చంద్రబాబు ఆదేశించారు. డబ్బుల కోసం కాకుండా దేవుడి కోసం పని చేసే ఏజెన్సీలను అవకాశం ఇవ్వాలని సూచించారు. తిరుమల లోని వాతావరణం ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్‌లో కూడా ఉండాలని ముఖ్యమంత్రి తెలిపారు. తిరుపతిలో పవిత్రమైన వాతావరణం లేకపోతే మంచిది కాదని.. తిరుపతికి వస్తే ప్రతి ఒక్కరికీ స్వర్గం అంటే ఇట్లుంటుంది అనే అనుభూతి కలిగేలా చేయాలన్నారు. ఇలా చేస్తే మనకూ పుణ్యం వస్తుందని చెప్పారు. తిరుపతి నుంచి రేణిగుంట వరకు విద్య, వైద్యం, పరిశ్రమలతో క్లీన్, గ్రీన్ సిటీగా అద్భుతమైన దివ్యక్షేత్రంగా రూపొందించాలని సూచించారు. టీటీడీ ఉద్యోగులు ఆత్మ గౌరవంతో ఉండేలా హౌస్ సైట్ ఏర్పాట్లు ఉండాలని.. మోడరన్ టౌన్ షిప్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దేవుని మీద భక్తిని పెంచడానికి, సేవ గుణాన్ని, గోశా లలను ఒక సెంటర్‌గా తయారు చేసి గోవులకు సేవ చేసేలా అభివృద్ధి చేయాలన్నారు.

బీరు ఫ్యాక్టరీలపై ఉన్న ప్రేమ కోట్లమంది

ప్రజలపై లేదు

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి వైఫల్యం వల్లనే తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కోతల పరిస్థితి ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమవర్శించారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కంటే ముఖ్యమైన అంశం ప్రభుత్వానికి ఏం ఉంటుందని ప్రశ్నించారు. సింగూరు ప్రాజెక్టు మరమ్మత్తు చేస్తామని 29 టీఎంసీలు ఖాళీ చేశా రని, సింగూరు ప్రాజెక్టు నీళ్లు ఖాళీ చేసి మర మ్మత్తు చేయకుండా వదిలిపెట్టారని మీడియా సమావేశంలో హరీశ్‌రావు మండిపడ్డారు. రైతులు ముఖ్యమా? రాజకీయం ముఖ్యమా? జూరాల గేట్లు ఎత్తిన రైతులపై కేసులు పెట్టి జైళ్లో వేస్తున్నారని హరీశ్?రావు తెలిపారు. తాగునీటిని బీరు కంపెనీలకు ఇస్తున్న మిమ్మల్ని ఏం చేయాలని నిలదీశారు. రైతుబీమా అందక 3 వేల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. రైతు సమస్యలపై మీటింగ్ అన్నారని, రేవంత్ రెడ్డి దిల్లీ వెళ్లారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు ముఖ్యమా? రాజకీయం ముఖ్యమా? అని ప్రశ్నించారు. కృష్ణా జలాలు ఏ



హక్కు లేని పెన్నా బేసిన్‌కు వెళ్తున్నాయని వెల్లడించారు."లిక్కర్ కంపెనీలకు నీటి కొరత రావొద్దని ఆబ్కారీ మంత్రి చెబుతున్నారు. రక్షణశాఖ కంపెనీలు, ఐఐటీకి తాగునీరు ఇవ్వలేమని చెబుతున్నారు?. తాగునీటి కొరత విషయంలో ప్రభుత్వానికి కార్యాచరణే లేదు. హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు తాగునీరు ఎలా?. కోట్లమందికి తాగునీరిచ్చే సింగూరు ప్రాజెక్టు పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారు?. ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టులో 3 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. కేవలం 3 టీఎంసీలే ఉన్నా బీరు ఫ్యాక్టరీలకు నీళ్లిస్తున్నారు.

రోడ్లపై కాదు.. ఆధారాలతో

ఈసీ వద్దకు వెళ్లండి

హైదరాబాద్:



ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ ఆందోళనల వల్ల రాజధాని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిపక్ష నేతలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆ యన అన్నారు. ఢిల్లీలో మీడి యాతో మాట్లాడిన ఈటల... ప్రతి పక్షాల తీరుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల ప్రక్రియలో అవక తవకలు జరిగాయని ఆరోపణలు చేసే వారు, అందుకు సంబంధించిన ఆధారాలతో ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని ఈటల సూచించారు. "ఎన్ని కల సంఘం నుంచి అపాయింట్‌మెంట్ తీసు కుని, మీ వద్ద ఉన్న ఆధారాలను సమర్పి ంచండి. అంతేగానీ, ఇలా రోడ్లెక్కి ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదు" అని ఆయన అన్నారు. గతంలో బీహార్‌లో 'ఓట్ల దొంగతనం' జరిగిందని ఇలాగే ఆరోపించారని, కానీ దాని ఫలితం ఏమైందో గుర్తుచేసుకో వాలని అన్నారు. బీహార్ ఎన్నికల నుంచి ఇండియా కూటమి గుణపాఠం నేర్చుకోవాలని ఈటల హితవు పలికారు.ప్రతిపక్షాలు బాధ్యతా యుతంగా వ్యవహరిస్తూ పోరాడటం నేర్చుకో వాలని ఆయన సూచించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో ఇండియా కూటమి సుప్రీంకోర్టుకు పాదయాత్ర తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు, కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేశారు.

ఎంపీ నిధులతో సి.సి రోడ్డు పనులు ప్రారంభం.



దోమ, అక్టోబర్ 13 (తెలంగాణ డైలీ న్యూస్):
చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఎంపీ నిధులతో వికారాబాద్ జిల్లా దోమ మండలం దాదాపూర్ గ్రామంలో సోమవారం సి.సి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. బిజెపి మండల అధ్యక్షుడు బొంగు మల్లేశం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ?ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు బొంగు మల్లేష్ మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధికి ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. సి.సి రోడ్డు నిర్మాణంతో దాదాపూర్ గ్రామ ప్రజల రవాణా కష్టాలు తీరుతాయని, రాబోయే రోజుల్లో కూడా ఎంపీ నిధులతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో దాదాపూర్ గ్రామ సర్పంచ్ కృష్ణవేణి (కృష్ణ), పంచాయతీ కార్యదర్శి మొగులయ్య, దాదాపూర్ బిజెపి కార్యకర్తలు వెంకటేష్ గౌడ్, దస్తగిరి, మందలి నరసింహులు, గ్రామ ఉపసర్పంచ్ సంతోష్, వార్డు సభ్యులు కాశయ్య, బోయ అనంతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సరైన వ్యక్తులకు పట్టం కట్టాలి.

- బీఆర్ఎస్ సీనియర్ నేత పోమాల అనంతయ్య



కుల్కచర్ల, అక్టోబర్ 13 (తెలంగాణ డైలీ న్యూస్):
రాబోయే పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో మంచి వ్యక్తులకు పట్టం కట్టాలని కుల్కచర్ల మండలం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ముజాహిద్ పూర్ గ్రామానికి చెందిన పోమాల అనంతయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో చదువుకున్న పట్టభద్రుల ఓటు ఎంతో కీలకమైనదని తెలిపారు. విద్యావంతులు, యువత సామాజిక బాధ్యతతో ఆలోచించి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. శాసనమండలిలో పట్టభద్రుల, నిరుద్యోగుల గొంతుకగా నిలిచే సరైన అభ్యర్థులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, మంచి వ్యక్తిత్వం, నిజాయితీ, ప్రజాసేవే పరమావధిగా పనిచేసే నాయకులను గెలిపించుకోవాలని సూచించారు. కుల్కచర్ల మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఉన్న గ్రాడ్యుయేట్లు వెంటనే తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేయించుకొని, పోలింగ్ రోజున రికార్డు స్థాయిలో ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఆయన కోరారు.

కట్టపై ముళ్లకంప రాకపోగాలకు తీవ్ర ఇబ్బందులు



నవాబుపేట,అక్టోబర్ 13 (తెలంగాణ డైలీ న్యూస్):
మహబూబ్ నగర్ నవాబుపేట మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో ఉన్న పెద్ద చెరువు కట్ట పరిస్థితి రోజురోజుకూ చాలా అధ్వానంగా తయారవుతోంది. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో కట్టకు ఇరువైపులా ముళ్లకంపలు, పెద్ద పెద్ద తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. దాంతో అసలు రోడ్డు ఎక్కడుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ?ఈ చెరువు కట్ట మార్గం నుంచే ప్రతిరోజూ గ్రామానికి చెందిన రైతులు తమ పొలాలకు వెళ్తుంటారు. అలాగే పాఠశాలకు వెళ్లే చిన్న పిల్లలు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు నిత్యం ఈ దారిలోనే ప్రయాణిస్తుంటారు. కట్టకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు రోడ్డు మీదికి రావడం వల్ల ఎదురుగా ఏ వాహనం వస్తుందో కనిపించక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక రాత్రి వేళల్లో ఈ దారిలో నడవాలంటేనే ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ముళ్ల తుప్పల నుంచి ఎప్పుడు పాములు, తేళ్లు బయటకు వస్తాయో తెలియక వణికిపోతున్నారు.

– చెరువులో పెరిగిన పనికిమాలిన చెట్లు...
కేవలం చెరువు కట్ట మీదే కాకుండా, పెద్ద చెరువు లోపల కూడా విపరీతంగా పనికిమాలిన చెట్లు, తుమ్మ చెట్లు గుబురుగా పెరిగిపోయాయి. దీనివల్ల వర్షాలు పడినప్పుడు చెరువులో నీరు నిల్వ ఉండే సామర్థ్యం బాగా తగ్గిపోతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గ్రామ ప్రజలు పంచాయతీ, నీటిపారుదల, ఉపాధి హామీ అధికారులను వేడుకుంటున్నారు. తక్షణమే స్పందించి కట్టపై ఉన్న ముళ్లకంపను తొలగించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు. అలాగే చెరువులో ఉన్న పనికిమాలిన చెట్లను ఉపాధి హామీ కూలీల ద్వారా తొలగిస్తే ఒకవైపు చెరువు బాగుపడుతుంది, ఇంకోవైపు గ్రామంలోని పేద కూలీలకు పని దొరుకుతుందని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కూలీలకు అడ్డగా మారిన బీజాపూర్ హైవే.

- పరిగిలో నిత్యసమస్యగా మారిన కూలీల అడ్డా
- వివేకానంద చౌరస్తాలో ట్రాఫిక్ దిగ్బంధం..
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు.



పరిగి, అక్టోబర్ 13 (తెలంగాణ డైలీ న్యూస్):
రోడ్డుపైనే కూలీల అడ్డా.. వాహనదారులు, ప్రజల తీవ్ర ఇబ్బందులు, పలుమార్లు మున్సిపల్ అధికారులకు పోలీసు అధికారులకు చెప్పిన ఫలితం శూన్యం, వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో తెల్లవారిందంటే చాలు స్వామి వివేకానంద ప్రధాన చౌరస్తా కూలీల సంద్రంగా మారుతోంది. పనుల కోసం వచ్చే అడ్డా కూలీలు రోడ్డుపైనే నిలబడుతుండటంతో, ఆ రోడ్డుపై వెళ్లాల్సిన వాహన దారులు తీవ్ర ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు వందలాది మంది కూలీలు పని కోసం రహదారిపైనే పడిగాపులు కాస్తున్నారు. కూలీల కోసం ప్రత్యేకంగా ఒక అడ్డా లేకపోవడంతో హైదరాబాద్ – బీజాపూర్ రహదారిపైనే వారు నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ?పని కోసం వాహనాలు వచ్చి ఆగిన క్షణమే కూలీలంతా ఒక్కసారిగా రోడ్డుపైకి దూసుకొస్తున్నారు. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి, ట్రాఫిక్ మరింత గందరగోళంగా మారుతోంది. ?ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఈ రద్దీలో గంటల తరబడి చిక్కుకుపోతున్నారు. ?ఇంత రద్దీ ఉన్నప్పటికీ ఉదయం వేళల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీక రించేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

– వాహనదారులకు తప్పని తిప్పలు..
కూలీలు, వాహనాలు ఒకే రోడ్డుపై కిక్కిరిసి ఉండటంతో ఏ క్షణాన ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని అంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు వచ్చినప్పటికీ కూలీలు రోడ్డుపై పక్కకు జరగకుండా నడిరోడ్డుపైనే నిలబడి పని కోసం వేచి చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరంటూ స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నా రు. ఇట్టి విషయంపై మున్సిపల్ అధికారులకు, పోలీస్ అధికారులకు అనేకసార్లు విన్నవించినప్పటికీ వారిలో స్పందన కరువైందని మండిపడు తున్నారు. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజస మంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటువైపు ఉన్న దుకాణదారుల ముందు కూలీలు గంటల తరబడి కూర్చుంటుండటంతో, కస్టమర్లు రాలేక వ్యాపారాలు చేసుకోలేకపోతున్నామని వ్యాపారస్తులు వాపోతున్నారు.



– నిత్య తలనొప్పిగా మారిన వివేకానంద చౌరస్తా.. ట్రాఫిక్
మరోవైపు కూలీలు రోడ్లపై నిల్చడం వల్ల ఏర్పడుతున్న తీవ్రమైన ట్రాఫిక్ సమస్య వాహనదారులకు నిత్య తలనొప్పిగా మారింది. ప్రతిరోజూ ఉదయం వేళల్లో ఈ ప్రధాన రహదారిపై వాహనాలు ముందుకు కదలక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి పనుల కోసం వచ్చి గంటల తరబడి రోడ్డుపైనే వేచి ఉండటం వల్ల కూలీలు కూడా తీవ్ర ఎండలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ప్రజలు అనేకసార్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రజా ప్రతినిధులు సైతం ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన హామీ రాలేదు.
కూలీల సంక్షేమాన్ని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

– అధికారులు నిర్లక్ష్యం వీడాలి..
పరిగి పట్టణంలోని బీజాపూర్ హైవేపై నెలకొన్న కూలీల సమస్యకు తోడు, తాజాగా చోటుచేసుకున్న ఓ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఓ మహిళా కూలి కల్తీ కళ్లు తాగి మత్తులో రోడ్డుపై వీరంగం సృష్టించింది. చేతిలోని టిఫిన్ బాక్స్‌తో అటుగా వెళ్తున్న వాహనాలను కొడుతూ బీభత్సం సృష్టించింది. వచ్చిపోయే వాహనాలను అడ్డుకుంటూ డ్రైవర్లను భయభ్రాంతులకు గురిచేయడంతో సుమారు గంటపాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఉదయం వేళ ఉద్యోగులు, విద్యార్థులు రోడ్డుపైకి వచ్చే సమయంలో ఈ ఘటన జరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, మున్సిపల్ అధికారులు స్పందించి హైవేపై అసాధ్యమైన పరిస్థితులకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

– ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి..
పరిగి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించి ఉదయం పూట తగిన చర్యలు తీసుకోవాలి. కూలీలు రోడ్డుపైకి రాకుండా వారికి తగిన నీడతో కూడిన వసతి కల్పించి ప్రత్యేక అడ్డాను ఏర్పాటు చేయాలని అందరూ కోరుతున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పోలీస్ అధికారులు పరస్పర సమన్వయంతో ముందుకు వచ్చి తక్షణ చర్యలు చేపట్టాలి. ?ఈ దీర్ఘకాలిక సమస్యకు త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపి వాహనదారులకు, ప్రజలకు ఊరట కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే రెచ్చిపోతున్న మట్టి మాఫియా ?..

- బోయపల్లిలో పట్టపగలే యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు!





మహబూబ్‌నగర్, అక్టోబర్ 13 (తెలంగాణ డైలీ న్యూస్):
అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యం అక్రమార్కులకు కొండంత కొమ్ము కాస్తోంది. నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిద్రమత్తులో జోగుతుండటంతో భూ బకాసురుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. మహబూబ్‌నగర్ పురపాలక పరిధిలోని బోయపల్లి సౌర విద్యుత్ కేంద్రం పక్కన, కాకర్లపాడు మైసమ్మ గుడికి వెళ్లే రహదారిలో ప్రభుత్వ భూమిని, గుట్టలను పట్టపగలే అక్రమంగా తవ్వేస్తున్నా సంబంధిత అధికారులు కంటితుడుపు చర్యలు కూడా తీసుకోక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కళ్ళముందే లక్షల విలువైన ప్రభుత్వ సంపద దోపిడీకి గురవుతున్నా, బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

– అధికారుల నిఘా వైఫల్యానికి స్పష్టమైన ఆధారాలు...
అక్రమార్కులు ఎంతటి తెగింపుతో వ్యవహరిస్తున్నారో స్థానికులు సేకరించిన ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. భారీ తవ్వకం యంత్రాలను రంగంలోకి దింపి కొండలను, గుట్టలను ఏకంగా ఇరవై అడుగుల లోతు వరకు గుల్ల చేస్తున్నా గనుల శాఖ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అక్కడ ఎలాంటి అనుమతి పత్రాలు గానీ, సూచిక బోర్డులు గానీ లేకపోయినా తవ్వకాలు సాగుతున్నాయంటే అధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా, పెద్ద సరుకు రవాణా లారీల్లో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తూ, అధికారులకు మరియు నిఘా నేత్రాలకు దొరక్కుండా వెనుక వైపు ఉన్న నంబరు బిళ్ళలను తుడిచేసి మరీ వాహనాలను నడుపుతున్నారు. ఇంత పెద్ద ఎత్తున అక్రమ రవాణా జరుగుతున్నా రవాణా శాఖ, రద్దీ నియంత్రణ పోలీసులు వాహనాలను తనిఖీ చేయకపోవడం వారి నిఘా వైఫల్యాన్నే ఎత్తిచూపుతోంది.

– రాబడికి గండి కొడుతూ... రక్షక వ్యవస్థ నిద్రపోతోందా?..
ఒక్కో లారీ మట్టి రవాణాకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములను, వన్నులను అక్రమార్కులు ఏమాత్రం చెల్లించకుండా రాబడికి గండి కొడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి లక్షల రూపాయల నష్టం వాటిల్లుతున్నా గనుల శాఖ, రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిమితికి మించిన బరువుతో నిరంతరం రాకపోకలు సాగిస్తున్న ఈ లారీల ధాటికి బోయపల్లి ప్రధాన రహదారి, పిల్లలమర్రి దారి తీవ్రంగా దెబ్బతింటున్నాయి. రోడ్డంతా దుమ్ము ధూళితో నిండిపోయి స్థానికులు, చిన్నపిల్లలు, బాటసారులు తీవ్ర శ్వాసకోస ఇబ్బందులు పడుతున్నా పురపాలక అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. పట్టణ నడిబొడ్డున ఇంత జరుగుతున్నా రెవెన్యూ, గనుల శాఖ, పురపాలక మరియు పోలీసు వ్యవస్థలు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ప్రజలు నిలదీస్తున్నారు.

– ఉన్నతాధికారులు తక్షణమే ముమ్మర తనిఖీలు చేపట్టాలి...
జిల్లా పరిపాలనాధికారులు, గనుల శాఖ ఉన్నతాధికారులు, రవాణా శాఖ మరియు పురపాలక కమిషనర్ తక్షణమే రంగంలోకి దిగి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వాహనాలను, తవ్వకం యంత్రాలను వెంటనే స్వాధీనం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ దందా వెనుక ఉన్న సూత్రధారులు ఎంతటివారైనా సరే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా తగిన రీతిలో స్పందించి చర్యలు తీసుకోకపోతే, ఈ ఆధారాలన్నింటినీ జతచేసి ఉన్నత న్యాయస్థానాన్ని, ప్రజా ఫిర్యాదుల అధికారిని ఆశ్రయించి అధికారుల వైఫల్యాన్నే ఎండగడతామని హెచ్చరిస్తున్నారు.

వికారాబాద్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించాలి.

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం.

వికారాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ డైలి న్యూస్) :

వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు వికారాబాద్ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీకి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కరువు పరిస్థితులను సమగ్రంగా అంచనా వేసి, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంతోపాటు సాగునీరు, తాగునీరు, పశుగ్రాస సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా గంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం, సాగునీరు అందక పెట్టుబడులు నష్టపోవడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతోంద న్నారు. జిల్లాలో కరువు తీవ్రతను క్షేత్రస్థాయిలో అంచనా వేసి బాధిత రైతులకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.?వ్యవసాయానికి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, కరువు కారణంగా పంటలు నష్టపో యిన రైతులకు వరి, పత్తి, మిర్చి, కూరగాయలు



మరియు ఇతర పంటలకు తగిన నష్టపరిహారం అందించాలని కోరారు. తాగునీటి కొరత నివారణకు చర్యలు చేపట్టాలని, ఉచితంగా లేదా రాయితీపై పశుగ్రాసం సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల కోసం ఉపాధి హామీ పనులను విస్తరించాలని, కౌలుకు భూములు తీసుకొని సాగు చేసిన వాస్తవ సాగుదారులను గుర్తించి వారికి కూడా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ప్రజల తాగునీటి అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని కోరారు. రైతులకు హామీలకే పరిమితం కాకుండా ఆచరణాత్మకంగా ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సావిత్రమ్మ, సుంకరి రాములు, చాకలి రవి, బాబు, సాయప్ప పాల్గొన్నారు.

విదేశీ వైద్య విద్యార్థుల భృతి పోరాటానికి విద్యార్థి సంఘం మద్దతు

- 9 నెలల భృతిని వెంటనే చెల్లించాలి..

- విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి అక్బర్ డిమాండ్...



వికారాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ డైలి న్యూస్) : ప్రభుత్వ వైద్యశాల వద్ద విదేశీ వైద్య విద్యార్థులు చేస్తున్న నిరసనకు మద్దతుగా విద్యార్థి సంఘం నాయకులు పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి అక్బర్ మాట్లాడుతూ, వివిధ దేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకుని ఇక్కడ ప్రభుత్వ వైద్యశాలలో శిక్షణ పొందుతున్న వైద్యులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన భృతిని గత తొమ్మిది నెలలుగా ఇవ్వడం లేదని తెలిపారు. ?గతంలో ఐదు వేల రూపాయలుగా ఉన్న భృతిని, ప్రభుత్వం జీఓ సంఖ్య 90 ద్వారా నెలకు 29,792 రూపాయలకు పెంచింది. కానీ గత తొమ్మిది నెలలుగా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. దీనివల్ల వారు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చదువు పూర్తి చేసుకుని పనిచేస్తున్నప్పటికీ, తమ రోజువారీ ఖర్చుల కోసం ఇంకా తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సి వస్తోందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే వారికి రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విదేశీ వైద్యులు రామకృష్ణ, సాయికుమార్, కుందన మరియు విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తేజ, నాయకులు దీపక్, పాండు, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యార్థులపై కాంగ్రెస్ ఎంపీ వేధింపులు...

- కాంగ్రెస్ ఎంపీని వెంటనే సస్పెండ్ చేయాలని బిజెపి నిరసన
- కులకచర్లలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహా ధర్నా


కులకచర్ల, అక్టోబర్ 13 (తెలంగాణ డైలి న్యూస్) :

వికారాబాద్ జిల్లా కులకచర్ల మండల కేంద్రంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సౌమ్య రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాడు భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టెలికామ్ సలహా సంఘం సభ్యులు గణపురం వెంకటయ్య గౌడ్ హాజరయ్యారు. ?ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు మాట్లాడుతూ... తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా విద్యార్థులపై శారీరకంగా, మానసికంగా వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అంగోమ్మా బిమోల్ అకోయిజాపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వెంటనే తన స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. మహిళల హక్కులు, భద్రత గురించి నిత్యం మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తమ స్వంత పార్టీ ఎంపీపై వచ్చిన ఈ తీవ్రమైన ఆరోపణలపై బాధ్యతాయుతంగా స్పందించాలని ప్రశ్నించారు.మహిళా విద్యార్థుల గౌరవం, రక్షణకు సంబంధించిన అంశాలను రాజకీయాలకు అతీతంగా



చూడాలని, ఈ ఆరోపణలపై తక్షణమే నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపించాలని నాయకులు కోరారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు ఎంపీని కాంగ్రెస్ పార్టీ నుండి తక్షణమే సస్పెండ్ చేయడమే కాకుండా, ఆయన పదవికి రాజీనామా చేసేలా చర్యలు తీసుకోవాలని బలంగా డిమాండ్ చేశారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా సంబంధిత అధికార యంత్రాంగం మరియు సంస్థలు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, సీనియర్ నాయకులు గిరిగంటి కేశవులు, హరికృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్ ముదిరాజ్, మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్, మహిళా మోర్చా నాయకురాలు వార్డు సభ్యురాలు ఉత్తర కుమారి, చాపలగూడెం సర్పంచ్ స్వప్న గోపాల్, మాజీ మండల అధ్యక్షులు జెమినీ సురేష్, యువమోర్చా నియోజకవర్గ సమన్వయకర్త గడుసు మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ హనుమంతు, పెరమళ్ళ వెంకట్, సీనియర్ నాయకులు నీరటి కర్ణయ్య, సుంకు మల్లేష్, రామస్వామి, సిహెచ్ వెంకట్రాములు, ఎన్నికల సహ సమన్వయ కర్త గాదె మల్లేష్, దళిత మోర్చా మండల అధ్యక్షులు బెందూరి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కొండ అంజి, కృష్ణ చారి, రాములు, అంజి, పార్టీ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చేర్యాల మున్సిపాలిటీ 11వ, 8వ వార్డు కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నిక.



చేర్యాల సెప్టెంబర్12 జనగామ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మరి ప్రతాపరెడ్డి పిలుపుమేరకు చేర్యాల మున్సిపాలిటీ 12 వార్డులు అందులో 8మరియు 11 వార్డ్ లో ఎన్నికలు నిర్ణయించడం జరిగింది. 11వ వార్డు అధ్యక్షులు పచ్చిమట్ల సత్యనారాయణ గౌడ్ మరియు ఎనిమిదవ వార్డు సునీల్ కుమార్ అధ్యక్షులుగా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఆగం రెడ్డి చేర్యాల టౌన్ ప్రెసిడెంట్ దాసర శ్రీకాంత్ గుసక వసంతి 11వ వార్డ్ ఇంచార్జ్ తదితరులు ఎన్నికలు నిర్వహించడం జరిగింది. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని వారు కొనియాడారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మండల అధ్యక్షులు మంజ మల్లేశం. సీనియర్ నాయకులు ఆడ చంద్రయ. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పచ్చిమట్ల వెంకటయ్య మాజీ ఎంపీటీసీ కొమ్ము నర్సింగరావు. గుస్క శీను. కాటం శీను. ముస్తాల యాదగిరి మెరుగు కృష్ణ ఎర్రగుంట ప్రభాకర్ బుట్టి బిక్షపతి. సుద్దాల లక్ష్మణ్. పాల్గొన్నారు.

ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి

వలిగొండ అక్టోబర్ 12 మారగోని శ్రీనివాస్ గౌడ్

గత నెల 21, 29 తేదీలలో వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన డీజిల్ దొంగతనం కేసులను చాకచక్యంగా ఛేదించినందుకు వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అభినందించారు. తెలివిగా, అతి తక్కువ సమయంలోనే పట్టుకుని దర్యాప్తును పూర్తి చేసినందుకు గాను సోమవారం ఆకాంక్ష్ యాదవ్ చేతుల మీదుగా ఆయనకు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి కృషి,నిబద్ధత అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా నేరాల నియంత్రణకు కృషి చేయాలని కోరారు.పోలీసు శాఖలో ఇలాంటి చురుకైన అధికారులు ఉండటం వల్ల ప్రజల్లో భద్రతా భావం పెరుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి..

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ
- ఎల్ నినో' ప్రభావాలు
- పంటల మార్పిడిపై అవగాహన సదస్సు..

పరిగి, అక్టోబర్ 13 (తెలంగాణ డైలి న్యూస్) :

వికారాబాద్ జిల్లా పరిగి మండలం చిగురాలపల్లి రైతు వేదికలో వ్యవసాయ పంటలపై 'ఎల్ నినో' ప్రభావాలు, వాటి నివారణోపాయాలపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లోని కమీషనర్ కార్యాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ శాఖ కమీషనర్, డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ?చిగురాలపల్లి రైతు వేదికలో ప్రత్యక్షంగా జరిగిన ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల వల్ల నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు సాంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటిని వినియోగించుకునే ఇతర లాభదాయకమైన పంటల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా వరి విస్తీర్ణాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడ ద్వారా నీటి ఎద్దడిని అధిగమించవచ్చని సూచించారు.?అనంతరం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు మాట్లాడుతూ, ఎల్ నినో వల్ల కలిగే నష్టాలను ఎలా



నివారించాలో రైతులకు క్షుణ్ణంగా వివరించారు. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటల సాగు పద్ధతులను, యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులకు స్పష్టమైన మార్గదర్శకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా వ్యవసాయ అధికారి కవిత, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్తార్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అరుణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి హరిప్రియ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రజిత, ఉద్యానవన శాఖ అధికారి సంతోష్, ఇతర మండల, గ్రామ స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్ అయేషా బేగం, గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

చిట్యాల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఐజీ షాహనవాజ్ ఖాసిం:

చిట్యాల, అక్టోబర్ 12

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు నేరాల నియంత్రణపై నిరంతరం నిఘా ఉంచాలని యాదాద్రి జోన్ ఐజీ షాహనవాజ్ ఖాసిం పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం నల్లగొండ జిల్లా చిట్యాల పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డులు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు.హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు.మహిళలు, బాలల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పోక్సో కేసుల్లో వేగవంతమైన, నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. దొంగతనాల నివారణకు రాత్రి పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయడంతో పాటు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి నేరస్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను చట్టప్రకారం పరిష్కరించాలని తెలిపారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఐజీ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ తనిఖీలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, చిట్యాల సీఐ సురేష్, ఎస్ఐ వెంకట్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి:



చిట్యాల,అక్టోబర్ 12:
వరి కోతలు ప్రారంభం ఐనందున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ ప్రజా సంఘాల నాయకులు అరూరి శ్రీను, కత్తుల లింగస్వామి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.చిట్యాల మండలం చిన్న కాపర్తి గ్రామంలో అఖిల భారత రైతు సంఘం మహాసభల ప్రాముఖ్యతను తెలుపుతూ సోమవారం నాడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ కరెంట్ కోతలతో పంటలు ఎండిపోయి,అల్లాడుతున్న రైతులను అన్ని రకాల ఆదుకోవాలని కోరారు.నల్లగొండ జిల్లా కేంద్రంలో నవంబర్ 15 వ తేదీ నుంచి జరిగే అఖిల భారత కిసాన్ సభలలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర గురించి పోరాట రూపాలు చర్చిస్తారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కోనేటి రాములు,రూపని ఇద్దయ్య, బొడ్డు నర్సింహా, శిరసు హన్మయ్య,రుద్రారపు పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సోలిపేట సుజాత రామలింగారెడ్డి పరామర్శ.

- గాయపడిన వారిని, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకురాలు.







దౌల్తాబాద్ అక్టోబర్ 12
దౌల్తాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు సోలిపేట సుజాత రామలింగారెడ్డి పరామర్శించారు. గొడుగుపల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ నల్ల ఆంజనేయులు సతీమణి ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం నుంచి కిందపడి గాయపడిన విషయం తెలుసుకున్న ఆమె బాధితురాలిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అలాగే శౌరీపూర్ గ్రామానికి చెందిన స్టీవెన్‌కు కిడ్నీలో రాళ్ల సమస్యకు శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకుని ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముబారస్పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ బోటుక రామచంద్రం తండ్రి మరణించిన విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ పరామర్శ కార్యక్రమాల్లో నాయకులు రణం శ్రీనివాస్, తిరుమలాపూర్ ఉపసర్పంచ్ నాగరాజు, ముబారస్పూర్ మాజీ ఎంపిటిసి బొట్కా తిరుపతి,నాయకులు ఇమాన్యుయేల్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

"Genజీ అంటే బీజేపీకి భయమా?"

:- యువత హక్కుల కోసం పోరాటం ఆగదు
:-పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



ప్రతినిధి, రామగుండం,అక్టోబర్ 12:- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద యువత ఓటు హక్కుల పరిరక్షణ కోసం ప్రతిపక్ష పార్టీలు చేపట్టిన పోరాటానికి మద్దతు తెలిపిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 19, 21, 22 కల్పించిన హక్కుల ప్రకారం శాంతియుత నిరసన ప్రతి పౌరుడి హక్కు అని స్పష్టం చేశారు.దాదాపు 40 వేల మంది పోలీసులతో విద్యార్థులు,యువతపై అణచివేతకు పాల్పడటం దారుణం అని విమర్శించారు. ఫస్ట్ టైమ్ ఓటర్ల ఓట్ల తొలగింపుపై ఆందోళన వ్యక్తం చేస్తూ,సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు."రాహుల్ గాంధీ నాయకత్వంలో యువత హక్కుల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం పోరాడతాం" అని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు.

తెలంగాణ సాధనలో కేసీఆర్ పోరాటం మరువలేనిది

●వికారాబాద్‌లో ఘనంగా బీఆర్ఎస్ జిల్లా దశాబ్ది ఉత్సవాలు..
● హాజరైన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు,

వికారాబాద్, అక్టోబర్ (తెలంగాణ డైలి న్యూస్):



జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా దశాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా తెలంగాణ సాధన కోసం గులాబీ బాస్ కేసీఆర్ చేసిన చారిత్రాత్మక పోరాటాన్ని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అద్భుత అభివృద్ధిని నాయకులు ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. ?ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొని కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ?ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కేవలం ఒక ఉద్యమం కాదని, అది నాలుగు కోట్ల ప్రజల ఆత్మగౌరవ పోరాటమని అన్నారు. కేసీఆర్ గారి ఆమరణ దీక్షా దీక్షాదక్షత, ఆనాడు ఆయన చూపిన గుండెధైర్యమే రాష్ట్రాన్ని సాధించిపెట్టిందని కొనియాడారు. తెలంగాణ వస్తే చీకట్లు అమ్ముకుంటారన్న దుష్ట విమర్శలను తిప్పికొట్టి, కేసీఆర్ నాయనాత్వంలో కోట్లాది ప్రజలు ఏకమై బంగారు తెలంగాణ సాధించుకున్నామని గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల త్ర యం అంకితభావంతో రూపురేఖలను మార్చేశారని తెలిపారు.

– కేసీఆర్ పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నింపాయి
– కొప్పుల మహేష్ రెడ్డి



గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలాపేతం చేసిన ఘనత కేసిఆర్ కు దక్కుతుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ అంటే ఒక వ్యక్తి కాదని, ఆయనో శక్తి అని అభివర్ణించారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కేసీఆర్ సర్కార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే రోడప్ గా నిలిచాయని పేర్కొన్నారు. రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు వంటి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లోని పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని తెలిపారు. కేసీఆర్ దార్శనికత, కేటీఆర్ టెక్నాలజీ ఆలోచనలు, హరీష్ రావు పరిపాలనా దక్షత కలిసి తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలిపాయని గుర్తుచేశారు. ఎన్ని కుట్రలు జరిగినా బీఆర్ఎస్ పార్టీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటుందని, రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

– గ్రామాల అభివృద్ధి కోసమే జిల్లాల ఏర్పాటు – పట్నం నరేందర్ రెడ్డి

ప్రజల సమస్యలు చెప్పుకునేందుకు సౌకర్యవంతంగా ఉండాలని ఉద్దేశంతోటే నూతన జిల్లాలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే అధికారులు వచ్చి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే విధంగా జిల్లాలను ఏర్పాటు చేయడం జరిగిందని ?కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, ఈ సందర్భంగా పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, పరిపాలనా సౌలభ్యం కోసం, గ్రామాల అభివృద్ధి కోసమే కేసీఆర్ జిల్లాల పునర్వ్యవస్థీక రణకు శ్రీకారం చుట్టారని స్పష్టం చేశారు. ఒకప్పుడు చిన్న పనుల కోసం కూడా జిల్లా కేంద్రాలకు వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సిన దుస్థితి ఉండేదని, కానీ కేసీఆర్ పాలనలో జిల్లాలను, మండలాలను పెంచడంతో పరిపాలన ప్రజల ముంగిట్లోకి వచ్చిందని అన్నారు. వికారాబాద్ జిల్లా ఏర్పడిన తర్వాత ఇక్కడ జరిగిన అభివృద్ధి గత పాలకుల కాలంలో ఎన్నడూ జరగలేదని, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికి చేరడంలో కేటీఆర్, హరీష్ రావు, ల పర్యవేక్షణ ఎంతో కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, , పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ పదేళ్ల పాలనలో సుభిక్షం.. రేవంత్ రెడ్డి పాలనలో అంధకారం

- పరిగి నియోజకవర్గంలో తీవ్రస్థాయిలో కరెంటు కోతలు.
- ఎండిపోతున్న పంటలతో అల్లాడిపోతున్న అన్నదాతలు.
- పరిగి బీఆర్ఎస్ సీనియర్ నేత ప్రవీణ్ కుమార్ రెడ్డి..



పరిగి, అక్టోబర్ 13 (తెలంగాణ డైలి న్యూస్):తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం వెలుగులతో కళకళలాడితే, కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రాష్ట్రాన్ని పూర్తిగా చీకటిమయం చేశారని పరిగి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత ప్రవీణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. పరిగి నియోజకవర్గంలో మీడియాతో మాట్లాడుతూ... ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై, స్థానిక ఎమ్మెల్యేపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించి, కోట్లాది ఎకరాలను సస్యశ్యామలం చేశారని గుర్తుచేశారు. కానీ, నేడు రేవంత్ రెడ్డి పాలనలో మళ్లీ పాత రోజులు వచ్చాయని, కరెంటు కోతలతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిగి నియోజకవర్గంలో అధికారుల వైఫల్యం, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతు న్నాయని, కరెంటు సరఫరా సరిగ్గా లేక బోర్లన్నీ నిలిచిపోతున్నాయని ధ్వజమెత్తారు. చేతికి వచ్చిన పంటలు ఎండిపోతుంటే రైతన్నలు కన్నీరు మున్నీరు అవుతున్నారని, వారి గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరావడంతోనే రైతుబంధును నీరుగార్చి, నేడు విద్యుత్ సరఫరాను కూడా గాలికొదిలేసిందని మండిపడ్డారు.ఇక నియోజకవర్గంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యే పనితీరుపై ప్రవీణ్ కుమార్ రెడ్డి మరింత ఘాటుగా స్పందించారు. ప్రజల సమస్యలను గాలికొదిలేసి కేవలం మాటల గారడీతో కాలం వెల్లదీస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులు కరెంటు కోతలతో రోడ్లెక్కి ఆందోళన చేస్తుంటే, స్థానిక ఎమ్మెల్యేకి కనీస స్పందన లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఎన్నికల సమయంలో కోటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు, నేడు ప్రజలను మోసం చేస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని, కేవలం కక్షసాధింపు చర్యలు, ప్రకటనలకే పరిమితమైందని ఎత్తిచూపారు. ఇదే వైఖరి కొనసాగితే పరిగి గడ్డపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులను కూడగట్టి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ తీరును ఎండగడుతూ భవిష్యత్తులో ప్రజల తరుపున గట్టిపోరాటం చేస్తామని ప్రవీణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

- అభివృద్ధి పేరుతో పేదల భూముల దోపిడీ, ప్రవీణ్ కుమార్ రెడ్డి

ఓవైపు కరెంట్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, మరోవైపు రేవంత్ రెడ్డి, పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే కలిసి చిన్న, సన్నకారు రైతుల కడుపు కొడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత ప్రవీణ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణం పేరుతో పరిగి నియోజకవర్గంలో ఉన్న పేద రైతుల భూములను దౌర్జన్యంగా, అన్యాయంగా గుంజుకుంటున్నారని మండిపడ్డారు. ?తమ జీవనాధారమైన కొద్దిపాటి భూములను కాపాడుకోవడానికి రైతులు ఆందోళన చెందుతుంటే, కాంగ్రెస్ నాయకులకు మాత్రం రియల్ ఎస్టేట్ దందాపైనే దృష్టి ఉందన్నారు. అభివృద్ధి పేరుతో పేదల భూములను తక్కువ ధరకు లాక్కొని, ఆ స్థలాల ద్వారా కోట్లకు కోట్లు సంపాదించు కోవడమే కాంగ్రెస్ నేతల ఏకైక లక్ష్యంగా మారిందని ఆరోపించారు. రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసి స్వార్థ ప్రయోజనాల కోసం భూదో పిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల అక్రమ సంపాదన దాహాన్ని ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామని స్పష్టం చేశారు.

ప్రయాణికులకు శుభవార్త - దసరా, దీపావళి పండుగలకు 750 ప్రత్యేక రైళ్లు

దసరా, దీపావళి పండగల్లో ప్రయాణికలు రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ పండగల సీజన్?లో 750కి పైగా ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రద్దీ పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు, టికెట్ కౌంటర్ల సంఖ్యను కూడా పెంచామని ఆయన స్పష్టం చేశారు. దసరా, దీపావళి పండుగల సందర్భంగా ప్రత్యేక రైళ్లపై సీపీఆర్ఓ శ్రీధర్?తో ముఖాముఖి.ప్రశ్న : దసరా, దీపావళి పండుగల సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ఎన్ని రైళ్లను నడిపిస్తోంది?జవాబు : దాదాపు 750పైగా ప్రత్యేక రైళ్లను ప్రస్తుతం నడిపిస్తున్నట్లు ప్రకటించాం. అవసరమైతే మరికొన్ని నడిపించే అవకాశాలున్నాయిప్రశ్న : ఏఏ రూట్లల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు? అక్కడ ఎన్ని రైళ్లను నడిపిస్తున్నారు?జవాబు : దసరా, దీపావళి పండుగలు అంటే ఉత్తర, తూర్పు భారత్ వైపు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సిటీ నుంచి కోస్తాంధ్ర, దక్షిణ భారత్ వైపు వెళ్లే వారు అధికంగా ఉంటారు. దిల్లీ, పట్నా, హౌరా వైపు ఎక్కువ మొత్తంలో డిమాండ్ ఉంటుంది. దక్షిణ భారత్‌లో బెంగళూరు, చెన్నై వెళ్లే వారు ఎక్కువగా ఉంటారు. ఇంకా ప్రముఖ దేవాలయాలు ఉన్న పట్టణాల వైపు ప్రయాణికులు ఆసక్తి చూపిస్తారు.ప్రశ్న : హైదరాబాద్?లోని చర్లపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్? రైల్వేస్టేషన్ల నుంచి ఎన్ని రైళ్లు అందుబాటులో ఉంటున్నాయి?జవాబు : ప్రస్తుతం సౌత్? సెంట్రల్ రైల్వే ఎక్కువ సంఖ్యలో ప్రత్యేక రైళ్లను నడిపిస్తుంది. అలాగే మహారాష్ట్రలోనూ స్పెషల్? రైళ్లను వేయడం జరుగుతుంది.ప్రశ్న : గత సంవత్సరం 1,000కి పైగా రైళ్లను నడిపించారు. ఈసారి 750 మాత్రమే పరిమితమైంది. ఎందుకు?జవాబ : ప్రతి ఏడాది రైళ్లకు డిమాండ్? పెరుగుతూనే ఉంది. ఎన్ని ట్రైన్లు వేసిన సరిపోయే పరిస్థితి ఉండదు. సౌత్ సెంట్రల్? రైల్వే 6 డివిజన్ల నుంచి 3 అవ్వడం వల్ల మేం ప్రకటించిన సంఖ్య తక్కువగా అనిపిస్తుంది.ప్రశ్న కానీ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా నడిపించడం వల్ల కొద్ది మేర అదనపు అంటే 1/3 ఛార్జీలుంటాయి. రూ.100 టికెట్? ఉంటే రూ.30 అదనపు ఛార్జీలుంటాయి. మొత్తం రూ.130 అవుతుంది టికెట్ ధర.

బాధితురాలికి పోగొట్టుకున్న పర్సు అప్పగింత

రూ.4 వేల నగదుతో కూడిన పర్సును తిరిగి అందజేసిన మట్వాడా పోలీసులు



వరంగల్ :వరంగల్ నారద అక్టోబర్ 12వరంగల్‌లోని ప్రసిద్ధ భద్రకాళి దేవాలయం వద్ద పోగొట్టుకున్న నగదుతో కూడిన పర్సును మట్వాడా పోలీసులు బాధితురాలికి తిరిగి అప్పగించారు. భువనగిరికి చెందిన అంకం సక్కుబాయి భద్రకాళి దేవాలయం వద్ద తన పర్సును పోగొట్టుకున్నారు. ఆ పర్సులో రూ.4 వేల నగదు ఉంది.మట్వాడా పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా అసిస్టెంట్ సబ్ఇ న్స్పెక్టర్ (డబ్ల్యూఏఎస్ఐ) కమల బాధితురా లు అంకం సక్కుబాయికి నగదుతో కూడిన పర్సును తిరిగి అందజేశారు.పోగొట్టుకున్న నగదును తిరిగి అందజేయడంలో మట్వాడా పోలీసులు చూపిన బాధ్యతాయుతమైన చర్య అభినందనీయంగా నిలిచింది.

నూతన ఎస్సైగా శ్రావణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



నెక్కొండ అక్టోబర్ 12, నెక్కొండ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా శ్రావణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేయనున్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసులను సంప్రదించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.మండలంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా, ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం పెంపొందించేలా విధులు నిర్వహించనున్నారు. నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రావణ్ కుమార్‌కు పలువురు శు భాకాంక్షలు తెలియజేశారు.

భూమితీసుకోని పరిహారం ఇవ్వలేదని.. రైతు ఆత్మహత్యాయత్నం..

- రైతును పరామర్శించిన మాజీమంత్రి మాజీ ఎమ్మెల్యేలు



వికారాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ డైలీ న్యూస్) :

ప్రభుత్వం తమ భూములను బలవంతంగా లాక్కుని, ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదనే మనోవేదనతో ఓ రైతు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన వికారాబాద్ జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలపై స్థానిక రైతుల్లో మరియు ప్రతిపక్ష వర్గాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. వికారాబాద్ జిల్లా పరిధిలోని లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం హకీంపేట గ్రామానికి చెందిన రైతు వెంకటయ్య భూమిని అధికారులు బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. అయితే, భూమిని తీసుకున్నప్పటికీ ఇంతవరకు ఎలాంటి నష్టపరి హారం మాత్రం చెల్లించలేదని రైతు కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. చేతికి వచ్చిన భూమి కోల్పోవడం, మరోవైపు జీవనాధారం కరువవడం, కుటుంబ పోషణ భారంగా మారడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రైతు వెంకటయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ?కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై ఆయనను ప్రాణాపాయ స్థితిలో జిల్లా మిషన్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ వైద్యులు ఆయనకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్సతో రైతు ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

- ఆసుపత్రిలో రైతు పరామర్శ.. భరోసా ఇచ్చిన బిఆర్ఎస్ నేతలు

జిల్లా మిషన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు వెంకటయ్యను మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి, కొప్పుల మహేష్ రెడ్డి తదితరులు పరామర్శించారు. రైతు ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఏ కష్టమొచ్చినా అధైర్యపడొద్దని, పార్టీ అండగా నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై వెంటనే జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడిన ఆమె, బాధిత రైతుకు సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చూడాలని, న్యాయమైన నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

– ప్రభుత్వంపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రైతులకు తీవ్ర మోసం చేస్తున్నారని, రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఘాటు విమర్శలు చేశారు. అన్నదాతల కన్నీళ్లు తుడవాల్సిన ప్రభుత్వమే, వారి పొట్ట కొట్టేలా వ్యవహరించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. బలవంతంగా భూములు లాక్కొని, పరిహారం ఇవ్వకుండా రైతులను ఆత్మహత్యల వైపు నెట్టేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, ప్రశ్నించిన వారిపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన విధానాలను మార్చుకోవాలని, బాధిత రైతు వెంకటయ్య కుటుంబానికి తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఆ కుటుంబానికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేనియెడల రైతుక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇంటి భూమి పూజలో పాల్గొన్న మార్కెట్ చైర్మన్ హరీష్ రెడ్డి



నెక్కొండ అక్టోబర్ 12,

మండలంలోని సూరిపల్లి గ్రామానికి చెందిన బొల్లెబోయిన రాజుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో బుధవారం నిర్వహించిన ఇంటి నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ పాల్గొన్నారు.ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సారథ్యంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్యా తిరుమల్,రెడ్లవాడ సొసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజేటి బిక్షపతి, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, పట్టణ అధ్యక్షుడు ఇదునూరి సాయికృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నేతుల సారంగం, తాళ్లపెల్లి భాస్కర్ గౌడ్, మందుల కవిరాజ్, కోటగిరి సాంబయ్య పాల్గొన్నారు.

శివాజీ మహారాజ్ మత నాయకుడు కాదు.. ప్రజా నాయకుడు

- మహనీయుల చరిత్రను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దు
- శివాజీ వీరత్వం, పరిపాలనా దక్షత యువతకు ఆదర్శం
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 12:

ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఒక మతానికి పరిమితం చేయడం సరికాదని, ఆయన ఒక మత నాయకుడు కాదని, ప్రజల సంక్షేమం కోసం పాటుపడిన గొప్ప ప్రజా నాయకుడని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డి బైపాస్ రోడ్డులో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నా రు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ శివాజీ మహారాజ్ గొప్ప వీరుడిగానే కాకుండా సమర్థవంతమైన పరిపాలకుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ప్రజల సంక్షేమం, రాజ్య రక్షణ, సుపరిపాలనకు ఆయన అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. అలాంటి మహనీయుడి చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం తగదన్నారు.

శివాజీ చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోంది

ఛత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రను బీజేపీ రాజకీయ లబ్ధి కోసం మతపరమైన కోణంలో ప్రచారం చేస్తోందని జగ్గారెడ్డి ఆరోపించారు. శివాజీ పాలనలో హిందువులతో పాటు ముస్లింలు కూడా కీలక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. దౌలత్ ఖాన్, ముల్లా హైదర్ వంటి ముస్లిం అధికారులు ఆయన పరిపాలనలో ఉన్నత స్థానాల్లో పనిచేశారని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా శివాజీ పాలన సాగించారని అన్నారు.

రాజ్యాల మధ్య యుద్ధాలకు మతం రంగు పులమొద్దు

శివాజీ మహారాజ్ తన రాజ్య రక్షణ కోసం ఇతర పాలకులతో యుద్ధాలు చేశారే తప్ప, ముస్లిం ప్రజలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయలేదని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. అప్పటి రాజ్యాల మధ్య జరిగిన యుద్ధాలను మతపరమైన ఘర్షణలుగా చిత్రీకరిం చడం చరిత్రను తప్పుగా అర్థం చేసుకోవడమేనని అన్నారు. శివాజీ మహారాజ్‌ను అన్ని వర్గాల ప్రజలు గౌరవించాల్సిన గొప్ప చారిత్రక నాయకుడిగా అభివర్ణించారు.

యువతకు శివాజీ చరిత్ర ఆదర్శం

నేటి యువత ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ధైర్యసా హసాలు, వీరత్వం, పరిపాలనా దక్షత, ప్రజల పట్ల నిబద్ధతను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహనీయుల చరిత్రను రాజకీయాలకు అతీతంగా భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. శివాజీ మహారాజ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

సిరిసిల్ల అర్బన్, అక్టోబరు 12 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారుల ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిం చిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్, ఇతర అధికారుల కు వినతిపత్రం అందజేసి పరిష్కరించాలని కోరారు. ఈ ప్రజావాణిలో 129 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని సంబంధిత జిల్లా అధికారులకు అందించి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి లో అదనపు కలెక్టర్ గర్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకటమాధవరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, సిరిసిల్ల ఆర్డీవో కార్యా లయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 7, వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 1 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సం బంధిత అధికారులకు అందించి పరిష్కరించాలని ఆర్డీవోలు ఆదేశించారు.తంగళ్లపల్లికి ఎంపీడీవోను నియమించాలితంగళ్లపల్లి మండలంలో ఎంపీడీవో లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటు పడడంతోపాటు సమస్యలు పరిష్కారం కావడం లేదని, వెంటనే రెగ్యూల్ ఎంపీడీవో ను నియమించాలని తాడూరు మాజీ సర్పంచ్ గుర్రం రాజలింగం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.కాలనీలో సమస్యలు పరిష్కరించాలితంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ శివారులోని కేసీఆర్‌నగర్‌లో నెలకొన్న సమస్యలను గ్రామపంచాయతీ పాలకవర్గంతోపాటు అధికారులు పట్టించుకోవడంలేదని, వెంటనే సమస్యలను పరిష్కరించాలంటూ కాలనీ మహి ళలు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమం లో రాగుల రోజా, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలి

- భూముల రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి
- గ్రామాల్లో నిర్దేశిత లక్ష్యాల మేరకు సర్వే పూర్తి చేయాలి
- రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాలు



హనుమకొండ అక్టోబర్ 12

జిల్లాలో మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూముల రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవితో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు, భూముల కొలతల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండలాల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలు, భూముల రీసర్వే పురోగతి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.భూముల రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని భూముల కొలతల శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు అందుబాటులో ఉన్న రోవర్లు, ఆధునిక సర్వే పరికరాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.సర్వేయర్లు క్షేత్రస్థాయిలో సర్వే పనులను వేగవంతం చేసి గ్రామాల్లో భూముల కొలతల ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారం, భూముల రీసర్వే పనుల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, పరకాల ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, భూముల కొలతల శాఖ సహాయ సంచాలకులు నూర్ సింగ్, వివిధ మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేధ, జై జాస్తి జంటగా

మైత్రీ మూవీ మేకర్స్ కొత్త చిత్రం



టాలీవుడ్‌లో సీనియర్ నటుడు శ్రీకాంత్ కుమార్తె మేధ మేకా హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. జై జాస్తి హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'మైత్రీ ఇన్ లవ్' అనే వర్కింగ్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. సోమవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. "వారితో మొదలై, మీ హృదయాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రేమకథ ఇది" అనే వ్యాఖ్యతో ఈ పోస్టర్‌ను పంచుకుంది. ఇది ఒక



అందమైన ప్రేమకథగా రూపుదిద్దుకోనుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తుండగా, మహేశ్ బాబు. పి క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు.
ఈ కొత్త సినిమా టైటిల్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. కాగా, నేటి ముహూర్తం ఈవెంట్ కు టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నటుడు శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు. దర్శకురాలు నందినిరెడ్డి ముహూర్తం షాట్ కు క్లాప్ కొట్టారు.

అల్లు అర్జున్ తో మాట్లాడుతున్న ఫొటోను పంచుకున్న లోకేశ్

"ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే.." అంటూ క్యాప్షన్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'ఏఏ23'పై ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. ఈ ప్రాజెక్టు ఆగిపోయిందంటూ ఇటీవల ప్రచారం జరగ్గా.. దర్శకుడు లోకేశ్ తాజా పోస్టుతో ఆ ఊహాగానాలకు తెరదించారు. త్వరలోనే ఆసక్తికరమైన వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.లోకేశ్ కనగరాజ్ సోమవారం తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అల్లు అర్జున్‌తో మాట్లాడుతున్న ఫొటోను పంచుకున్నారు. "ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే వస్తున్నాయి" అంటూ క్యాప్షన్ జత చేశారు. దీంతో ఈ సినిమాపై అభిమానుల్లో మళ్లీ అంచనాలు పెరిగాయి.అల్లు అర్జున్, లోకేశ్ కనగరాజ్ తొలిసారి కలిసి పనిచేయనున్నట్లు ఈ ఏడాది జనవరిలో అధికారికంగా ప్రకటించారు. ఆ సందర్భంగా విడుదల చేసిన వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. అందులో ఓ సింహం స్థిరంగా నిలబడగా.. దాని చుట్టూ కొన్ని నక్కలు తిరుగుతూ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తాయి. ఈ వీడియో సినిమా కథ గురించి పెద్దగా వివరాలు వెల్లడించకపోయినా.. ప్రాజెక్టుపై భారీ అంచనాలు పెంచింది.'ఏఏ23'ను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు. గతంలో అల్లు అర్జున్ నటించిన బ్లాక్‌బస్టర్ 'పుష్ప'ను కూడా ఈ నిర్మాణ సంస్థే తెరకెక్కించింది. అయితే 'ఏఏ23' కథ, ఇతర నటీనటులు, చిత్రీకరణ వివరాలపై అధికారికంగా మరింత సమాచారం రావాల్సి ఉంది.మరోవైపు అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న 'రాకా' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఇందులో దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నారు. అల్లు అర్జున్, దీపికా తొలిసారి జంటగా కనిపించనున్న ఈ సినిమాపైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ 44వ పుట్టినరోజు సందర్భంగా 'రాకా'ను అధికారికంగా ప్రకటించడంతో పాటు ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.ఇప్పుడు 'ఏఏ23'పై లోకేశ్ చేసిన తాజా ప్రకటనతో ఈ ప్రాజెక్టు ఎప్పుడు పట్టాలెక్కుతుందా? ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అన్న ఉత్కంఠ మొదలైంది.

నా జీవితంలో చేసిన అతిపెద్ద ప్రయోగం అదే..

ఆసక్తికర విషయాలు చెప్పిన రాజమౌళి



దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కెరీర్‌లో 'బాహుబలి'కి ప్రత్యేక స్థానం ఉంది. ఈ సినిమాతో ఆయన పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సంపాదించగా, 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. అయితే తనకు అత్యంత సంతృప్తినిచ్చిన సినిమా మాత్రం 'బాహుబలి' కాదని రాజమౌళి వెల్లడించారు. తనలో నిజమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిన చిత్రం 'ఈగ' అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.
సూపర్‌స్టార్ మహేశ్ బాబుతో కలిసి రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌తో మాట్లాడిన ఆయన తన సినీ ప్రయాణానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. ప్రేక్షకులు తన కెరీర్‌ను 'బాహుబలి'కి ముందు, తర్వాత అని విభజించి చూస్తారని, కానీ తన దృష్టిలో మాత్రం 'ఈగ'కు ముందు, తర్వాత అనే విభజన ఉంటుందని తెలిపారు.'ఈగ' తన కెరీర్‌లో చేసిన అతిపెద్ద ప్రయోగమని రాజమౌళి చెప్పారు. ఒక ఈగను ప్రధాన పాత్రగా తీసుకుని, దాని చుట్టూ భావోద్వేగాలతో కూడిన కథను నడిపించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభవమని వివరించారు. ఆ సినిమా తనకు అందించిన సంతృప్తి మాటల్లో చెప్పలేనిదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎన్ని సినిమాలు తీసినా 'ఈగ' తనకు ఎప్పటికీ ప్రత్యేకంగానే ఉంటుందని స్పష్టం చేశారు.రాజమౌళి వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. భారీ స్థాయి చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు, తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిన సినిమాగా 'ఈగ'ను పేర్కొనడం విశేషం. మరోవైపు మహేశ్ బాబుతో రూపొందిస్తున్న 'వారణాసి'పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.



అసలు ఊహించలేదు..


జడ్జిగా అవకాశం రావడంపై అనుపమ కామెంట్స్!

టాలీవుడ్ టాలెంటెడ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ నటిస్తూ అదరగొడుతున్న ఆమె, త్వరలోనే 'క్రేజీ కల్యాణం' సినిమాతో అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్న అనుపమ, ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొని తన కెరీర్‌కు సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా రియాలిటీ షోకి జడ్జిగా మారడంపై ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. షాకింగ్‌గా అనిపించింది: ఇంటర్వ్యూలో భాగంగా "అది కొత్త ఏమీ కాదు.. జడ్జి అవ్వడం, డాన్స్ షో చేయడం మీకు ఎలా అనిపించింది?" అని ప్రశ్నించగా, అనుపమ చాలా సరదాగా స్పందించారు. "నాకు కూడా ఇదొక పెద్ద షాకే. నేను అసలు ఊహించలేదు. సడన్‌గా అలాంటి ఒక అవకాశం వచ్చింది. కొత్త విషయాలను ప్రయోగాత్మకంగా చేయడం నాకు ఇష్టం కాబట్టి వెంటనే ఓకే చెప్పాను. ఇక ఇప్పటికే సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, మ్యూజిక్ వీడియోలు చేశాను" అంటూ తన ఆశ్చర్యంతో పాటు ఎగ్జైట్‌మెంట్‌ను పంచుకున్నారు. 'ఢీ' షోలో జడ్జిగా ఎంట్రీ: తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న 'ఢీ' డ్యాన్స్ షోకు అనుపమ పరమేశ్వరన్, జానీ మాస్టర్ జడ్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. సినిమాల్లో గ్లామర్, యాక్టింగ్‌తో అలరించే అనుపమ, తొలిసారి ఒక డ్యాన్స్ రియాలిటీ షోకి జడ్జిగా ఎంట్రీ ఇవ్వడం ఆమె కెరీర్‌లో మరో విశేషంగా నిలిచింది. పల్లెటూరి నేపథ్యంలో 'క్రేజీ కల్యాణం': ఇదిలా ఉంటే, అక్టోబర్ 16న విడుదల కానున్న 'క్రేజీ కల్యాణం' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్, అనుపమ పరమేశ్వరన్, అఖిల్ రాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఇక తెలంగాణ గ్రామీణ నేపథ్యం, బంధువుల గొడవలు, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సాగే ఈ సినిమా ట్రైలర్ ఇటీవల విడుదలై యూట్యూబ్‌లో దూసుకుపోతోంది.

పవన్ కల్యాణ్ తొలి సినిమాకు 30 ఏళ్లు..

అల్లు అరవింద్ స్పెషల్ నోట్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమలో 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రత్యేక లేఖను విడుదల చేశారు. పవన్ కల్యాణ్ సినీ ప్రస్థానం, ఆయన సామాజిక దృక్పథాన్ని ప్రశంసిస్తూ రాసిన ఈ లేఖ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.
"ప్రియమైన శ్రీ పవన్ కల్యాణ్ గారికి, మన ఇద్దరి కలయికలో వచ్చిన మొదటి సినిమా విడుదలై 30 సంవత్సరాలు పూర్తయిందని తెలిసి ఆశ్చర్యానికి, దాదాపు షాక్‌కు గురయ్యాను. ఈ పరిశ్రమలో మీరు అద్భుతమైన ప్రయాణాన్ని సాగించారు. 30 ఏళ్లు పూర్తి చేసుకున్న మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని అల్లు అరవింద్ తన లేఖలో పేర్కొన్నారు.
పవన్ కల్యాణ్ భవిష్యత్తును ఉద్దేశిస్తూ, "మీరు ఎంచుకున్న మార్గంలో మరిన్ని సంవత్సరాలు విజయం సాధించి, సంతృప్తికరమైన జీవితం గడపాలని నేను ఆకాంక్షిస్తున్నాను. అన్నింటికంటే ముఖ్యంగా, సినిమాలకు అతీతంగా సమాజం పట్ల మీకున్న విస్తృత దృష్టిని, మీరు చేస్తున్న సేవను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అని కొనియాడారు. చివరగా, "డియర్ కల్యాణ్, మరోసారి అభినందనలు. నా శుభాకాంక్షలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి" అని అల్లు అరవింద్ తన లేఖను ముగించారు.
పవన్ కల్యాణ్ కథానాయకుడిగా పరిచయమైన "అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి" చిత్రానికి అల్లు అరవింద్ నిర్మాతగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైన వారి ప్రొఫెషనల్ బంధాన్ని గుర్తుచేసుకుంటూ, నేడు పవన్ కల్యాణ్ ఒక నటుడిగానే కాకుండా ఉప ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో ఉన్న తరుణంలో అల్లు అరవింద్ ఈ లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది.పవన్ కల్యాణ్, సుప్రియ యార్లగడ్డ జంటగా ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రం 1996 అక్టోబరు 11న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ తొలి చిత్రంలో పవన్ నటనకు మంచి మార్కులే పడ్డాయి.





'కాస్ట్' టీజర్ విడుదల

వరుణ్ సందేశ్, గగన్ బాబు , సత్యం రాజేశ్, రవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సోషల్ డ్రామా 'కాస్ట్'. ఏకే జంపన్న రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. కశిక కపూర్, దివి వద్యా కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా ఇంటెన్స్ అండ్ గ్రిప్పింగ్ టీజర్‌ను లాంచ్ చేశారు టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ ఈ సినిమాతో జంపన్నకు చాలా మంచి పేరు రావాలని, మరిన్ని సక్సెస్‌ఫుల్ సినిమాలు చేయాలని కోరుకుంటున్నానని తెలిపారు.ప్రొడ్యూసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 'మా హీరోలు వరుణ్ సందేశ్, గగన్, రవితో పాటు మా టెక్నీషియన్లందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అనూప్ రూబెన్స్ అద్భుతమైన మ్యూజిక్ చేశారు. త్వరలోనే పాటలు విడుదలవుతాయి. డైరెక్టర్ ఈ సినిమాను బ్రహ్మాండంగా తీశారు' అని అన్నారు. డైరెక్టర్ ఏకే జంపన్న మాట్లాడుతూ ఈ సినిమాలో వరుణ్ సందేశ్, రాజేశ్, రవి, గగన్ అద్భుతంగా నటించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ రావు, నవీన్ ఎర్నెని, గగన్ బాబు, అనూప్ రూబెన్స్, రవి, సత్యం రాజేశ్, దివి వద్యా పాల్గొన్నారు.

Edited,Printed,Published and Owend by CHITELA KRISHANA ,Printed at sravanthi prienters ,
rtc crss road ,Hyderabad-500001. Published at:4-80/1, VIKARABAD, Telangana.